క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



కాలిన కోళ్ల ఫారాన్ని పరిశీలిస్తున్న గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: మండలంలోని పాతర్లపల్లి పంచాయతీ వెంకటేశ్వర కాలనీలో లంక శ్రీరాములుకు చెందిన కోళ్ల ఫారం ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయింది. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ మంగళవారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకుని బాధితుడికి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మహంతి వెంకటప్పలనాయుడు, గొర్లె సీతారాం, గొర్లె జగ్గనాయుడు, నేతల కృష్ణ, అప్పలకొండ, వాళ్లె అప్పన్న, గొర్లె సత్యం, వలిరెడ్డి సూరిబాబు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ధ్యేయం



బాధితురాలికి చెక్ అందిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

ఎచ్చెర్ల : ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరరావు అన్నారు. ఇటీవల బ్రెయిన్ సర్జరీ చేయించుకున్న లావేరు గ్రామానికి చెందిన ఉప్పు పాపాలుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.1.57 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ చెక్కును బాధితురాలికి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ముప్పిడి సురేష్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఇనపుకుర్తి తోటయ్యదొర, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందనలు



సాయిమణికంఠను అభినందిస్తున్న సర్పంచ్, ఉపాధ్యాయులు

ఎచ్చెర్ల : లావేరు మండలం బయ్యన్నపేట ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థి సాయి మణికంఠ ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో అర్హత సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థిని హెచ్ఎం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సర్పంచ్ కొన్ని హేమసుందర్ మంగళవారం అభినందించారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ కొన్ని ఆదినారాయణ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సుకు గౌరీశంకర్



శ్రీకాకుళం కల్చరల్: తెలంగాణాలోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఈ నెల 25, 26 తేదీలలో జరగనున్న అంతర్జాతీయ 13వ మాతృభాషా శాస్త్రవేత్తల సదస్సుకు జిల్లాకు చెందిన కథా రచయిత భమిడిపాటి గౌరీశంకర్‌కు ఆహ్వానం అందింది. నూతన విద్యావిధానం భారతీయ భాషలు అనే అంశంపై పత్రాన్ని సమర్పించనున్నట్లు గౌరీశంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మునసబుపేటలోని గాయత్రీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్‌లో తెలుగు విభాగాధిపతిగా సేవలందిస్తున్న గౌరీశంకర్‌ను విద్యాసంస్థల అధినేత స్వామినాయుడు, ప్రిన్సిపాల్ పులఖండం శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ కె.వి.వి.సత్యన్నారాయణ మంగళవారం అభినందించారు.

పింఛన్ సొమ్ము చెల్లింపు



ఎంపీడీఓకు నగదు అందిస్తున్న కుటుంబసభ్యులు

జి.సిగడాం: మండలంలోని పెంట గ్రామ సచివాలయంలో సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్న చదువుల భానుప్రతాప్ కుటుంబ సభ్యులు మంగళవారం ఎంపీడీఓ గుంటముక్కల రామకృష్ణారావును కలిసి రూ.49వేల పింఛన్ సొమ్మును చెల్లించారు. ఇందులో రూ.16వేలు ప్రభుత్వానికి జమ చేయగా మిగిలిన రూ.33 వేలను సచివాలయ సిబ్బందికి అందజేశారు. భానుప్రతాప్ తండ్రి ఇటీవల మరణించడంతో మనస్తాపానికి గురై ఇటువంటి పని చేశాడని కుటుంబ సభ్యులు అధికారులకు తెలియజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పొట్నూరు సురేష్‌కుమార్, సచివాలయ సిబ్బంది వావిలపల్లి మనోజ్‌కుమార్, సాకేటి ప్రసాద్ పాల్గొన్నారు.

కనుగులవానిపేటలో గ్రామదేవత పండగ



గ్రామంలో పండగ సందడి

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని కనుగులవానిపేటలో మంగళవారం అమ్మవారి పండుగలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం మహిళలంతా కలిసి ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి ముర్రాటలు సమర్పించారు. ఎమ్మెల్యే గొండు శంకర్ హాజరయ్యారు.

హద్దులు దాటుతున్న అక్రమాలు

- ముద్దాడపేట ఇసుక రీచ్‌లో నిబంధనలకు తూట్లు
- ఉచితం ముసుగులో అక్రమ వ్యాపారం
- చోద్యం చూస్తున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఉచితం ముసుగులో ఇసుక అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోంది. కూటమి నాయకుల మద్దతుతో కొందరు నిబంధనలకు తూట్లుపొడుస్తూ కాసులు దండుకుంటున్నారు. ఎచ్చెర్ల మండలంలో అధికారిక ఇసుక రీచ్ ముద్దాడపేటలో ఉంది. ఇది బీ కేటగిరీ రీచ్. మొత్తం రెండు ఎకరాల్లో ఇసుక సేకరణకు అనుమతులు ఇచ్చారు. దీని ప్రకారం నిర్ణయించిన హద్దుల్లోనే ఇసుక తరలించారు. రీచ్‌లో యంత్రాలు వినియోగించకూడదు. మీటర్‌కు మించి లోతున ఇసుక తొలగించకూడదు. 74250 మెట్రిక్ టన్నుల ఇసుక సేకరణకు మాత్రమే ఇక్కడ అనుమతి ఉంది. అయితే ఈ నిబంధనలేవీ ఇక్కడ అమలు కావడం లేదు. రీచ్‌లో ఇసుక తవ్వకాలకు పొక్లెయినర్లు యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. పదుల సంఖ్యలో రోజూ లారీల్లో ఇసుక తరలిస్తున్నారు. అధికారికంగా మాత్రం తరలిస్తున్న వాహనాలను తక్కువ చేసి చూపిస్తున్నారు. కూటమి నాయకుల కనుసన్నల్లో ఇక్కడ ఇసుక వ్యాపారం సాగుతోంది. పగటి పూట ఇసుకను తీసుకెళ్లి తమ్మినాయుడుపేటలో పోగులుగా వేస్తున్నారు. రాత్రివేళ విశాఖపట్నం తరలిస్తున్నారు. పాత పొన్నాడ రీచ్ నుంచి సైతం అక్రమంగా ఇసుక తరలించి పోగులు వేస్తున్నారు. అధికారులు ఈ అక్రమ తరలింపుపై పూర్తిస్థాయిలో దృష్టి సారించడం లేదు. ఎప్పుడో ఒకసారి జాతీయ రహదారిపై అరకొరగా తనిఖీలు చేపట్టి వదిలేస్తున్నారు. అంతర జిల్లా ఇసుక చెక్‌పోస్టు పైడిభీమవరం బిల్లులు, పత్రాలు లేని వాహనాలు అప్పుడప్పుడూ బయటపడుతున్నా తర్వాత వ్యవహారం సర్వసాధారణమైపోతోంది. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి రీచ్‌లలో అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.



ముద్దాడపేట రీచ్‌లో యంత్రాలతో ఇసుక తవ్వకం



తమ్మినాయుడుపేట సమీపంలో ఇసుక పోగులు

అమలుకాని నిబంధనలు..



ఉచితం ముసుగులో కొందరు ఇసుక అక్రమ వ్యాపారం చేస్తున్నారు. పగలు పోగులు వేసి రాత్రులు తరలిస్తున్నారు. అధికార క్వారీల్లో నిబంధనలు అతిక్రమించి రవాణా జరుగుతోంది. నిబంధనలు పక్కాగా అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

– సనపల నారాయణరావు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి

చర్యలేవీ..?



ఇసుక అక్రమ వ్యాపారం జోరుగా సాగుతున్నా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఇసుక రీచ్‌లో యంత్రాలతో యంత్రాలతో తవ్వకాలు జరుగుతున్నాయి. వాటిని సీజ్ చేయాలి. ఇసుక తవ్వకాలు పర్యావరణానికి హానికరంగా పరిణమించాయి.

– బెందు రామారావు, ముద్దాడ

అక్రమ రవాణా అడ్డుకోవాలి



ఇసుక అక్రమ రవాణా అడ్డుకోవాలి. నిబంధనలు పక్కాగా అమలు చేయాలి. రీచ్‌లో అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలి. ఉచిత నిబంధన కొందరు అక్రమార్కులకు ప్రయోజనకరంగా మారింది. రీచ్‌లపై అధికారులు ప్రత్యేక దృష్టిపెడితే అక్రమ రవాణా అడ్డకోవచ్చు.

– బోర సాయిరాం రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు, ఎచ్చెర్ల

జగనన్న మేలు మరిచిన ‘తండేల్’



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేత పిన్నింటి సాయికుమార్

రణస్థలం: ఇటీవల విడుదలైన తండేల్ సినిమాలో జగనన్న చేసిన మేలును చూపించకపోవడం సరికాదని వైఎస్సార్‌సీపీ ఎచ్చెర్ల నియోజకవర్గ నాయకుడు పిన్నింటి సాయికుమార్ అన్నారు. రణస్థలంలోని థియేటర్‌లో మత్స్యకార సంఘ నాయకులతో కలిసి మంగళవారం తండేల్ సినిమాను వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తండేల్ సినిమా హీరో పాత్రకు మూలమైన కె.మత్స్యలేశం మత్స్యకారుడు గనగళ్ల రామారావు టీడీపీ ప్రలోభాలకు తలొగ్గి జగనన్న మేలును మరిచి మాట్లాడటం భావ్యం కాదన్నారు. అప్పటి విజయనగరం మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, అప్పటి ఎమ్మెల్యే కిరణ్ కుమార్, న్యాయవాది గురుమూర్తి కృషి వల్లే మత్స్యకారులు విడుదలయ్యారనే విషయం అందరికీ తెలుసన్నారు. కార్యక్రమంలో రణస్థలం జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, వైస్ ఎంపీపీలు రాయపురెడ్డి భుజంగరావు, మైలపల్లి కామరాజు, నాయకులు మహంతి పెదరామినాయుడు, చినరామినాయుడు, పచ్చిగుళ్ల సాయిరాం, టీకే బ్రహ్మాజీ, న్యాయవాది గురుమూర్తి, మత్స్యకార సంఘ నాయకులు చీకటి యర్రయ్య, మగుపల్లి రాము, పిల్ల తాత, ఉప్పాడ అప్పన్న, మైలపల్లి గురువులు, పొట్టివాడు, అల్లిపల్లి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

సంతోషిమాతకు జన్మనక్షత్ర పూజలు



శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలోని సంతోషిమాత దేవాలయంలో స్వాతి నక్షత్రం సందర్భంగా మంగళవారం జన్మనక్షత్ర పూజలు నిర్వహించారు. అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి సుప్రభాతసేవ, మహన్యాస పూర్వక నమక చమక సహిత పంచ సూక్తాలతో క్షీరాభిషేకం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ



మాట్లాడుతున్న ఎంఈవో-1 రామకృష్ణ

గార: చిన్నారులకు విద్యాబోధన చేయడంలో నైపుణ్యాలు పెంచుకోవాలని ఎంఈవో-1 ఎస్.రామకృష్ణ అన్నారు. మంగళవారం గార మండల అంగన్‌వాడీ కార్యకర్తలకు కొర్ని స్కూల్ కాంప్లెక్సులో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1, 2 తరగతులను అంగన్‌వాడీలో కలుపుతుండటం వల్ల ప్రతిఒక్కరూ శిక్షణ సద్వినియోగం చేసుకోని వ్యక్తిగత నైపుణ్యం సాధించాలన్నారు. డీఆర్‌పీలు చెప్పిన ప్రతీ అంశంపైనా పట్టుసాధించాలన్నారు. మండలంలో 128 మందికి వారం పాటు శిక్షణ ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈవో-2 పి.వినోదిని, డీఆర్‌పీలు సురేష్, శ్రీనివాసరావు, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

జి.సిగడాం: అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆహ్లాదకర వాతావరణంలో ఆట పాటలతోడిన విద్యను బోధించాలని ఎంఈఓలు అరసాడ రవి, ముళ్ల శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం జి.సిగడాం మోడల్ పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి పేరిట ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నా శామ్యేల్ లెంక, డీఆర్‌పీలు పిట్టా అప్పారావు, కిల్లారి వెంకటరమణ పాల్గొన్నారు.

సక్రమంగా సంఘాల నిర్వహణ



శిక్షణలో మాట్లాడుతున్న మోహనరావు

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లా యూనిట్‌గా ప్రతి స్వయం సహాయక సంఘం పరిస్థితి తెలుసుకోవాలని వెలుగు సంస్థ సంస్థాగత నిర్మాణం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మోహన్‌రావు అన్నారు. ఎచ్చెర్లలోని జిల్లా సాంకేతిక శిక్షణ కేంద్రంలో ఏపీ ప్రభుత్వ సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పోవర్టీ ఆధ్వర్యంలో వెలుగు క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందికి మంగళవారం రెండో రోజు శిక్షణ జరిగింది. సంఘాల లావాదేవీలపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. కార్యక్రమలో ఏసీ రవికుమార్, ఏపీఎం భాగ్యలత, రిసోర్సు పర్సన్లు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు ఆర్థిక సాయం



విద్యార్థినులకు చెక్‌లు అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం న్యూకాలనీ: భౌతిక శాస్త్రవిభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ఆర్థిక సాయం అందించిన దాతలకు శ్రీకాకుళం మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరరావు కృతజ్ఞతలు తెలిపారు. 1970లో కళాశాలలో పని చేసిన భౌతికశాస్త్ర అధ్యాపకులు పిడపర్తి సోమయాజుల కోరిక మేరకు వారి కుమారులు పిడపర్తి సూర్యనారాయణ మూర్తి, పిడపర్తి శ్రీరామ్ (యూఎస్ఏ) సౌజన్యంతో మంగళవారం డిగ్రీలో అత్యధిక మార్కులు సాధించిన సుదీప్త పాణిగ్రహి, యశోదలకు రూ.25 వేలు చొప్పున, పీజీసెట్-2024 ఫిజిక్స్ విభాగంలో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన టి.పుణ్యవతికి రూ.10వేలు చొప్పున చెక్‌లు అందచేశారు.

ఏపీటీఎఫ్ నాయకుల పరామర్శ

జి.సిగడాం: ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు, గొర్లెపేట జిల్లా పరిషత్ ఉన్న పాఠశాల సోషల్ ఉపాధ్యాయుడు, దవళపేట గ్రామానికి చెందిన బొడ్డేపల్లి రమణమూర్తి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్‌మోహన్, మండల శాఖ అధ్యక్షుడు కిల్లారి వెంకటరమణ, కాయల రమేష్, గౌరవ అధ్యక్షులు సీర రాము మంగళవారం గ్రామానికి వెళ్లి రమణమూర్తిని పరామర్శించారు. కార్యక్రమంలో మక్క శ్రీరాములు, పిట్టా అప్పారావు, చిత్తిరి జగదేశ్వరావు, కోనారి నారాయణప్పుడు, త్రిపురాన తవిటియ్య పాల్గొన్నారు.

విద్యార్థినులను వేధిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న డీఎస్పీ వివేకానంద

శ్రీకాకుళం క్రైమ్ : విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా.. వేధించినా సహించేది లేదని డీఎస్పీ సీహెచ్ వివేకానంద హెచ్చరించారు. జిల్లాకేంద్రంలోని ఆర్ట్స్ కళాశాల, మహిళా కళాశాల సమీప ప్రాంతాల్లో నిత్యం తిరిగే కొంతమంది ఆకతాయిలతో పాటు సుమారు 48 మంది విద్యార్థులను, వారి తల్లిదండ్రులను వన్‌టౌన్, టూటౌన్ స్టేషన్లకు మంగళవారం రాత్రి పిలిపించారు. మొదటి హెచ్చరికగా వదిలేస్తున్నామని, ఇకనైనా జాగ్రత్తగా మసులుకోవాలని హితవుపలికారు. కార్యక్రమంలో సీఐలు పైడపునాయుడు, ఈశ్వరరావు, ఎస్ఐలు హరికృష్ణ, సంతోష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విజయగణపతికి అలంకరణ



శ్రీకాకుళం కల్చరల్ శ్రీకాకుళం నగరంలోని పాలకొండ రోడ్డులో గల విజయగణపతి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సూర్యనగేష్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారిని విశేషంగా అలంకరించారు.

సర్టిఫికెట్ కోర్సులతో ఉపాధి అవకాశాలు



విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రిన్సిపాల్

శ్రీకాకుళం న్యూకాలనీ: స్వల్పకాలిక సర్టిఫికెట్ కోర్సులతో ఉపాధి అవకాశాలు లభిస్తాయని శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల(అటానమస్) ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు అన్నారు. వాణిజ్యశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అకౌంటింగ్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ టాలీ సర్టిఫికెటు కోర్సు మంగళవారంతో పూర్తయ్యింది. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రిన్సిపాల్ ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కామర్స్ హెచ్‌వోడీ ఎల్.కృష్ణారావు, వైస్ ప్రిన్సిపాల్ పైడి శంకరనారాయణ, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ ఎస్.పద్మావతి, సీవోఈ టి.ఆదిలక్ష్మీ, బి.ప్రభాకరరావు, కామర్స్ అధ్యాపకులు లలితాబాయి, సంతోషి, పావని పాల్గొన్నారు.

పక్కాగా కొలతలు



వేతనదారులకు గరిష్ఠ వేతనం వచ్చేలా ఉపాధి పనులు చేయించాలని నీటి యాజమాన్య సంస్థ ఏపీడీ కె.లోకేశ్ అన్నారు. మంగళవారం బొంతలకోడూరులో ఉపాధి పనులకు సంబంధించి కొలతలు తీశారు. ఉదయం, సాయంత్రం కనీసం ఎనిమిది గంటలు పనిచేస్తే రూ.300 వరకు గరిష్ఠ వేతనం వస్తుందన్నారు. ఏపీవో శోభాదేవి, ఈసీ నారాయణమ్మ, టీఏలు పాల్గొన్నారు. – ఎచ్చెర్ల క్యాంపస్

నిఘా నీడన నగరం



శ్రీకాకుళం రెండో పట్టణ పరిధి భైరివానిపేట, శాంతినగర్ కాలనీ, నాగావళి నదీ పరివాహక, శివారు నిర్మానుష్య ప్రాంతాల్లో చట్టవ్యతిరేక కార్యకలాపాలు చేపడుతున్నవారిపై మంగళవారం డ్రోన్ నిఘా పెట్టారు. బహిరంగ మద్య పానం, గంజాయి సేవనం, పేకాట, ఈవ్ టీజింగ్, చైన్‌స్నాచింగ్ వంటి కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు నిరంతరం నిఘా పెడుతున్నామని పోలీసులు చెబుతున్నారు.

– శ్రీకాకుళం క్రైమ్

దుప్పలవలస విద్యార్థుల ప్రతిభ



దుప్పలవలసలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు చిత్రలేఖనం పోటీల్లో సత్తాచాటారు. ఏపీ స్టేట్ క్రియేటివిటీ ఫైన్ ఆర్ట్సు అకాడమీ(గుంటూరు) సంస్థ ఇటీవల వర్చువల్ విధానంలో నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల్లో బోనెల తేజ ప్రతిభ కనబరిచిన బాల చిత్రకళారత్న అవార్డు, రూ.2000 నగదు, డ్రాయింగ్ టీచర్ గొర్లె దుర్గారావు అవార్డు అందుకున్నారు. చిత్రలేఖనంలో పాల్గొన్న విద్యార్థులను ప్రిన్సిపాల్ బోర బుచ్చిరావు, ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

పొంచి ఉన్న ముప్పు



శ్రీకాకుళం-రాజాం ప్రధాన రహదారిలో పరిమితికి మించిన లోడుతో చెరుకు లోడ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో ఇతర ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం పాలఖండ్యాం సమీపంలో అధిక లోడుతో వెళ్తున్న చెరుకు లారీని తప్పించడానికి వెనుక ఉన్న వాహనచోదకులు నరకయాతనపడ్డారు.

– జి.సిగడాం

రైతుల సంక్షేమానికే రిజిస్ట్రేషన్



రిజిస్ట్రేషన్ సేవలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి త్రినాథస్వామి

శ్రీకాకుళం రూరల్: రైతుల సంక్షేమ కోసం రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని జిల్లా అగ్రికల్చర్ అధికారి కె.త్రినాథసామి సూచించారు. పొన్నాం, చింతాడ గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలను మంగళవారం సందర్శించారు. విశిష్ట గుర్తింపు సంఖ్య ప్రకియ జరుగుతున్న తీరును మండల వ్యవసాయాధికారి ఉషాకుమారిని అడిగి తెలుసుకున్నారు. మండలంలో 7,900 మంది రైతులకు ఈకేవైసీ కాగా, ఇప్పటి వరకు 3200 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని వివరించారు.

ద్రవ జీవామృతం తయారీపై శిక్షణ

ఎచ్చెర్ల క్యాంపస్:



శిక్షణ ఇస్తున్న ప్రసాదరావు

ప్రకృతి వ్యవసాయంలో భూసారం పెంచే ద్రవ జీవామృతం తయారీపై దోమాంలో రైతులకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఆవు మూత్రం, పేడ, మట్టి, బెల్లం వంటి మిశ్రమాలతో 200 లీటర్ల ద్రవ జీవామృతం తయారు చేశారు. ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు ఐసీఆర్‌పీ ప్రసాదరావు శిక్షణ నిర్వహించారు. ప్రతి 15 రోజులకోసారి ద్రవ జీవామృతం తయారుచేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో శిక్షకులు మెట్ట ధనుంజయరావు, లీడ్ ఫార్మర్లు పాల్గొన్నారు.

జనన, మరణాల నమోదు తప్పనిసరి



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జనన, మరణాల వివరాలను కార్యాలయాల్లో తప్పనిసరిగా నమోదు చేయించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. మంగళవారం న్యాయ సేవా సదన్‌లో న్యాయ విభాగం విద్యార్థులకు జనన, మరణ, కుల, వివాహ సర్టిఫికెట్, డ్రైవింగ్ లైసెన్స్ రిజిస్ట్రేషన్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన ప్రతి వ్యక్తికి జనన ధ్రువపత్రం ఎంత అవసరమో చనిపోయాక మరణ ధ్రువ పత్రం కూడా అంతే ముఖ్యమని చెప్పారు. లైసెన్సులు లేని వాహనాలు ప్రమాదాలకు గురైతే ఎటువంటి క్లెయిమ్‌లు రావన్నారు. కార్యక్రమంలో కె.రామకృష్ణ, డాక్టర్ పి.సుధీర్‌కుమార్, ఎస్.రమణమూర్తి, గంగాధరరావు, రె.రవికుమార్, జి.ఇందిరాప్రసాద్ పాల్గొన్నారు.